క్లుప్తంగా

స్వీపర్‌కు వీడ్కోలు



రామక్కతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

హుస్నాబాద్‌రూరల్: మండల పరిధిలోని గాంధీనగర్ పాఠశాలలో 40యేళ్ల పాటు రామక్క స్వీపర్‌గా సేవలందించి ఉద్యోగ విరమణ పొందడంతో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఆమె సేవలను గ్రామ యువకులు గుర్తించి సత్కరించి రూ.5 వేలు నగదును అందించారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నీలం కుమార్, ఉపాధ్యాయులు అరుణ, సునీత, రాములు, స్వరూప, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్టలపై పట్టింపేది?



మెమోరాండం అందిస్తున్న సీపీఎం నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): తపస్‌పల్లి రిజర్వాయర్, పెద్ద చెరువు కట్టల మరమ్మతులపై అధికారులు పట్టించుకోవాలని సీపీఎం నాయకులు గురువారం అయినాపూర్ గ్రామ ఉపాధి సభలో మెమోరాండం అందించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కమిటీ నాయకుడు తేలు ఇస్తారి మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు ఎంపిక జాబితాలో మొదటిగా గ్రామాల్లో రిజర్వాయర్ చెరువుకట్ట నిర్మాణ పెండింగ్ పనులు పేర్కొనాలని సూచించారు. రిజర్వాయర్‌పై కంప చెట్లు వివిధ రకాల తుమ్మ చెట్లను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో సాయిలు, రాజు, యాదగిరి, అనిత, నరసయ్య, దేవదానం, భూమయ్య, బీరయ్య, సత్తవ్వ, రేఖ, జయవ్వ, లాస్య పాల్గొన్నారు.

రోయింగ్‌లో కాంస్య పతకం



పతకం సాధించిన అశ్వత్థామ

మద్దూరు(హుస్నాబాద్): ఆల్ ఇండియా రోయింగ్ క్రీడలో దూల్మిట్ట మండల కేంద్రానికి చెందిన నాచగొని అశ్వత్థామగౌడ్ కాంస్య పతకం సాధించాడు. కేరళ రాష్ట్రంలోని అల్పి పట్టణంలో నిర్వహించిన రోయింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని ప్రతిభ చూపాడు. గ్రామస్తులు సోమవారం అభినందించారు.

పీఆర్సీ అమలు ఎప్పుడు?



జగదేవ్‌పూర్ పాఠశాలలో సభ్యత్వ నమోదు

జగదేవ్‌పూర్(గజ్వేల్): పీఆర్సీని వెంటనే అమలు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజయ్య డిమాండ్ చేశారు. మండలంలోని పలు పాఠశాల్లో గురువారం సభ్యత్వ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులను ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదర్శ పాఠశాల, సమగ్ర శిక్షలో పనిచేసే తాత్కాలిక ఉద్యోగుల వేతనాలను వెంటనే విడుదల చేయాలని, కేజీబీవీ ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేయాలని, మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సత్తయ్య, కార్యదర్శి పోచయ్య, జిల్లా నాయకులు శంకర్, భాస్కర్, జలేందర్‌రెడ్డి, నాగరాజు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వివక్ష సరికాదు



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్: జిల్లెల్లగడ్డ గురుకుల పాఠశాలలో 7వ తేదీన మరణించిన వివేక్ మృతికి బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం అంటే దళిత విద్యార్థిపై వివక్ష చూపడమేనని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు జంజీరపు ఎల్లేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ వివేక్ మరణించి పది రోజులు గడుస్తున్నప్పటికీ ఏ అధికారిపైనా చర్యలు తీసుకోలేదన్నారు. ఆ కుటుంబానికి కూడా ఎలాంటి న్యాయం జరగలేదని వాపోయారు. వారం రోజుల్లో దర్యాప్తు పూర్తి కాకపోతే చలో కలెక్టరేట్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విజయ్, రాజు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.





హౌసింగ్‌బోర్డు కాలనీలో నిరుపయోగంగా సమీకృత మార్కెట్

సారూ.. ఎందుకు నిర్మించారు?

సిద్దిపేట పట్టణంలో పలు కాలనీల్లో నిర్మించిన సమీకృత మార్కెట్‌లు, మార్కెట్ కమిటీ దుకాణాల కోసం నిర్మించిన భవనాలు నిరుపయోగం దర్శనమిస్తున్నాయి. దాదాపు రూ.30 లక్షల వ్యయంతో హౌసింగ్‌బోర్డు కాలనీలోని మార్కెట్ నిర్మించారు. అలాగే రూ.76 లక్షల ఖర్చుతో ప్రశాంత్‌నగర్‌లోని మార్కెట్ నిర్మించారు. గతంలో చేపల మార్కెట్ సమీపంలో అద్దెకు ఇచ్చేందుకు గాను లక్షలు ఖర్చు చేసి మార్కెట్ కమిటీ దుకాణాలు నిర్మించారు. కాని ఇవన్నీ ఇప్పుడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయి. లక్షల నిధులతో నిర్మించిన ఈ నిర్మాణాలు నిరుపయోగంగా మారడంపై ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వీటి నుంచి ఏం ప్రయోజనం ఆశించారో తెలియడంలేదని పలువురు ఎద్దేవా చేస్తున్నారు.

– సాక్షిస్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



ఉపయోగంలో లేని వ్యవసాయ మార్కెట్ కమిటీ దుకాణాలు



సమీకృత మార్కెట్‌లో దుస్థితి

నష్టపోతున్న మొక్కజొన్న రైతులు

- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- పీఏసీఎస్ ఛైర్మన్ హరికృష్ణారెడ్డి



మాట్లాడుతున్న హరికృష్ణారెడ్డి

తొగుట(దుబ్బాక): మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు లేక రైతులు నష్టపోతున్నారని పీఏసీఎస్ ఛైర్మన్ కన్నయ్యగారి హరికృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంటను రైతులు దళారులకు విక్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. మద్దతు ధర క్వింటాలుకు రూ.2,400లు కాగా దళారులు రూ.1,800లకు క్వింటాలు చొప్పున కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. సన్న వడ్లకు బోనస్ రూ.500లు నేటికీ చెల్లించలేదన్నారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ యాదగిరి, మండల అధ్యక్షుడు రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీలు స్వామి, రమేశ్, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్‌కు ఎంపికైన విద్యార్థులు



జగదేవ్‌పూర్(గజ్వేల్): విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దుబ్బాకటౌన్: విద్యార్థులు అన్నిరంగాల్లో ప్రతిభ కనబర్చాలని రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గజ్వేల్‌లో జరిగిన జోనల్‌స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో అండర్ –14 విభాగంలో ద్వితీయ స్థానం సాధించి పెద్దపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు పాఠశాల విద్యార్థులు ఎ.యశ్వంత్, జి.సౌమ్య ఎంపికయ్యారన్నారు. అలాగే సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి అండర్–19 వాలీబాల్ పోటీలకు ఎ.సంజన ఎంపికయ్యారన్నారు. ఆ విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీకి..

జగదేవ్‌పూర్(గజ్వేల్): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జగదేవ్‌పూర్ ఆదర్శపాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ స్లీవరాజ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13న పటాన్‌చెరులో నిర్వహించిన ఉమ్మడి మెదక్‌జిల్లా కబడ్డీ పోటీల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థినులు చందన, జినత్ ప్రతిభ చాటారన్నారు. కార్యక్రమంలో పీఈటీ అనంతరాములుచారి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



దుబ్బాకటౌన్: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సీపీఆర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ జూనియర్ కళాశాల(కో ఎడ్యుకేషన్)లో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, నాసర్‌పుర పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోహర్, అంబేడ్కర్‌నగర్ యూపీఎస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మానస మాట్లాడారు. ఎవరైనా కుప్పకూలిపోతే ఆందోళనకు గురికాకుండా ముందుగా 108కి ఫోన్‌చేసి సీపీఆర్ చేసి ఆదుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల స్టాఫ్ కమిటీ ఛైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఏజీఎంసీ దేవయ్య, స్టూడెంట్ కౌన్సిలర్ కనుకచంద్రం, క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, స్పోర్ట్స్ ఇన్‌చార్జి అశోక్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నగేష్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియాన



బాలసదన్ చిన్నారులకు నిత్యావసరాలను అందజేస్తున్న క్రిస్టియాన తదితరులు

గజ్వేల్‌రూరల్: పౌష్టికాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యవంతులుగా ఉంటామని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియాన అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సౌజన్య, డాక్టర్ సరోజ పర్యవేక్షణలో గురువారం 'మెరుగైన ఆహారం – మెరుగైన భవిష్యత్' కార్యక్రమం నర్వహించారు. అందులో భాగంగా బియ్యం, పప్పులు, ధాన్యాలు, వంటనూనె, గోధుమపిండి, బిస్కెట్లు, స్నాక్స్ లాంటి ఆహార పదార్థాలు; సబ్బులు, షాంపూ, టూత్‌పేస్టులు, దుస్తులు, పెన్నులు, పుస్తకాలు, దుప్పట్లు, ఇతర నిత్యావసరాలను సేకరించి కొండపాకలోని నిషాంత్ ఆనంద బాలసదన్‌లో అనాథ పిల్లలకు అందజేశారు. ఈ సందర్భంగా కమలా క్రిస్టియాన మాట్లాడుతూ విద్యార్థులు సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను అభినందించారు. అదే విధంగా మండల పరిధిలోని అనంతరావుపల్లిలో డీబీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, మహిళలు ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహించారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

క్యాన్సర్ డే సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలల్లో క్యాన్సర్‌డే నిర్వహించారు. ప్రముఖ వైద్యురాలు ప్రశాంతి మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహన చాలా ముఖ్యం అన్నారు. స్త్రీలకు సంబంధించిన క్యాన్సర్ గురించి వివరించారు. వైద్యులు శ్రీధర్, ప్రిన్సిపాళ్లు గణపతిరావు, కమలా క్రిస్టియాన, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతుల పరిశీలన



పాఠాలు చదివిస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): పదో తరగతి విద్యార్థులకు ప్రతిరోజు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని గుర్జకుంట ప్రాథమిక, ఉన్నత పాఠశాల, దొమ్మాట ప్రాథమిక పాఠశాలలను గురువారం సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎఫ్ఆర్ఎస్ నమోదును పరిశీలించారు. కచ్చితంగా మెనూ పాటించాలని ఆదేశించారు.

ముగిసిన పోషణ మాసోత్సవాలు



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాక ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న పోషణ మాసోత్సవాలు గురువారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని చెప్యాలలో సెక్టార్ స్థాయి పోషణమాసం నిర్వహించారు. ఉత్పత్తులు, పోషకాహార వినియోగం, పౌష్టికాహారంపై అవగాహన కలిగించారు. పోషకాలతో కూడిన వివధ రకాల వంటకాలను ప్రదర్శించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించారు. చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం గురించి అంగన్‌వాడీ టీచర్లు వేసిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీడీపీఓ ఎల్లయ్య, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ శ్యాంసన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక, మెడికల్ ఆఫీసర్ డా.సమీనా సుల్తానా, ఐసీపీఎస్ సూపర్‌వైజర్ నర్సింహులు, పంచాయతీ కార్యదర్శి నర్సింహులు, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, లక్ష్మి, షబానా, పున్నమ్మ, ప్రేమలత, బుజ్జమ్మ, రమ, రేణమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.



వివిధ వంటకాల ప్రదర్శన

రేపటి బీసీ బంద్‌ను సక్సెస్ చేద్దాం

అంబేడ్కర్ సంఘం రాష్ట్ర నేత ప్రకాశ్

అక్కన్నపేట(హుస్నాబాద్): ఈ నెల 18న తలపెట్టిన బీసీల రాష్ట్రబంద్‌ను విజయవంతం చేయాలని, తాము సంపూర్ణ మద్దతు ప్రకటించినట్టు తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్ చెప్పారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేంతవరకు ఉద్యమం ఉధృతం చేయా లని పిలుపునిచ్చారు. బీసీలకు రిజర్వేషన్లు దక్కాలంటే రాజ్యాంగ సవరణచేసి 9వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. సబ్బండ వర్గాలు అధిక సంఖ్యలో పాల్గొని బీసీ బంద్ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎల్లయ్య, సుధాకర్, వెంకటస్వామి, జగదీశ్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం చేయాలి

హుస్నాబాద్: బీసీలకు సామాజిక న్యాయం చేయాలని 18న నిర్వహించనున్న తెలంగాణ బంద్‌కు జేఏసీ, ఎమ్మార్పీఎస్, తెలంగాణ అంబేడ్కర్ సంఘాలు మద్దతు ప్రకటించాయి. పట్టణంలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవన్‌లో సమావేశం నిర్వహించారు. 10 శాతం అగ్రవర్ణ కులాలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజరేషన్లు ఇచ్చినప్పుడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి సామాజిక న్యాయం పాటించాలని డిమాండ్ చేశారు. జేఏసీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, కో ఆర్డినేటర్లు సారయ్య, వీరన్న యాదవ్, వివిధ సంఘాల నాయకులు వెంకటస్వామి, సుధాకర్, లింగారెడ్డి, లక్ష్మణ్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

గజ్వేల్: బీసీలకు 42శాతం రిజర్వేషన్ సాధనే లక్ష్యంగా నిర్వహించతలపెట్టిన రాష్ట్రబంద్‌ను విజయవంతం చేయాలని బీసీ కుల సంఘాల ఐక్య వేదిక నాయకులు నర్సింగరావు, కనకయ్య, శీను, రమేశ్, స్వామిచారి, ఎల్లయ్య, స్వామి పిలుపునిచ్చారు. గజ్వేల్ ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. అనాదిగా బీసీలకు మోసం జరుగుతోందని వాపోయారు. రిజర్వేషన్‌ను సాధించేవరకు విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. విఠలాచారి, పోచయ్య, సుధాకర్, నరేశ్‌యాదవ్, యాదగిరి, శ్రీధర్, ప్రసాద్, రమణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లను అమలు చేయాలి

నంగునూరు(సిద్దిపేట): బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్‌తో బీసీ సంఘాల ఇచ్చిన పిలుపుకు ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు తెలుపుతోందని అధికార ప్రతినిధి రాజేందర్ చెప్పారు. నంగునూరులో విలేకరులతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. నర్సింహులు, బాలరాజు, కనకయ్య, బాలయ్య, రాజయ్య, నితిన్ తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్: మద్దతు ప్రకటిస్తున్న వివిధ సంఘాల నాయకులు

మొసలి కన్నీరు కారుస్తున్న ప్రభుత్వాలు

మిరుదొడ్డి(దుబ్బాక): బీసీ రిజర్వేషన్ల పేరిట రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీలు మొసలి కన్నీరు కారుస్తున్నాయని బీసీ సంఘాల నాయకులు మండిపడ్డారు. మిరుదొడ్డిలో వారు మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం తమకు కావాల్సిన వాటా కేటాయించాలన్నారు. బీసీల్లో ఉన్న ఐక్యతను చాటడానికి నిర్వహించతలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డీఎస్పీ సంపూర్ణ మద్దతునిస్తుందని డీఎస్పీ ప్రతినిధులు చందు మహారాజ్, దీపక్ మహారాజ్ తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు బాల్‌రాజు, నర్సింహులు, జ్ఞానేశ్వర్, స్వామి, కిష్టయ్య, వెంకటయ్య, బీఆర్ఎస్ నాయకులు లింగం, మల్లేశం, బాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఎస్‌సీఈఆర్‌టీ సెమినార్‌లో జిల్లా ఉపాధ్యాయుడు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 'విద్యా సామర్థ్యాల పెంపుపై కౌన్సిలింగ్, గైడెన్స్ పాత్ర' అనే అంశంపై రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ నిర్వహించిన సెమినార్‌లో జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు పూర్ణచందర్ పాల్గొన్నట్లు జిల్లా సాంఘికశాస్త్ర ఫోరం నాయకులు గురువారం తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడుగా, జిల్లా ఫోరం అధ్యక్షుడిగా విధులు నిర్వహిస్తున్న పూర్ణచందర్ గురువారం హైదరాబాద్‌లో జరిగిన సెమినార్‌లో పాల్గొన్నారని తెలిపారు.

◆ పరిసరాలు శుభ్రం చేసిన విద్యార్థినులు

వర్గల్(గజ్వేల్): ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులో భాగంగా గురువారం హైదరాబాద్‌లోని బీఆర్ అంబేడ్కర్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు వర్గల్ ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. ప్రోగ్రాం ఆఫీసర్ స్వప్న, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పాండు ఆధ్వర్యంలో గురువారం వారంతా అమ్మవారిని దర్శించుకున్నారు.

◆ మధ్యాహ్న భోజనం పరిశీలన

సిద్దిపేటఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలు చేయాలని మిట్టపల్లి పీఏసీఎస్ ఛైర్మన్ చింతల శ్రీనివాస్ అన్నారు. మిట్టపల్లి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని గురువారం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. రుచికరమైన భోజనం వడ్డించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

◆ ఉత్తర్వులు విడుదల చేయాలని వినతి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పదోన్నతి పొందిన ఉపాధ్యాయుల సర్వీసు క్రమబద్ధీకరణ ఉత్తర్వులను విడుదల చేయాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. పాఠశాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల గౌరవవేతనం విడుదల చేయాలని గురువారం డీఈఓ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. అలాగే మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలను సక్రమంగా అందించాలన్నారు.

◆ సిద్దిపేట ఆర్టీసీ డీఎం బదిలీ

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ రఘు బదిలీ అయ్యారు. నూతన మేనేజర్‌గా డి.భవభూతి నియామకమయ్యారు. ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు. రఘు హైదరాబాద్ ప్రధాన కార్యాలయానికి బదిలీ కాగా, నూతన డీఎం హకీంపేట డిపో నుంచి వచ్చారు. రఘును సిబ్బంది ఘనంగా సన్మానించారు.

◆ బాల్య వివాహాలు నేరం

కొండపాక(గజ్వేల్): బాల్య వివాహాలు చేయడం నేరమని కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ హెచ్చరించారు. బాలికల హైస్కూల్లో గురువారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసేవారు, వారికి సహకరించేవారు నేరస్తులే అవుతారన్నారు. హెచ్‌ఎం శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టరు భాస్కర్‌రెడ్డి, షీటీం సభ్యులు మహేశ్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

◆ అనుమతి తప్పనిసరి

హుస్నాబాద్: దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచా విక్రయదారులు తప్పకుండా అనుమతి తీసుకోవాలని ఏసీపీ సదానందం తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనుమతి లేకుండా నిల్వ చేసినా, దుకాణాలు నెలకొల్పినా, భద్రతా ప్రమాణాలు పాటించకపోయినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

◆ గాలికుంటు నివారణ టీకాలు

వర్గల్(గజ్వేల్): గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించడం ద్వారా రైతులు, పశుపోషకులు పశుసంపదను కాపాడుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.సర్వోత్తమ్ యాదవ్ సూచించారు. గురువారం అనంతగిరిపల్లిలో ఉచిత టీకాల శిబిరం నిర్వహించారు. 89 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు.

◆ డీసీసీ అధ్యక్ష పదవి రేసులో యాదగిరి

గజ్వేల్: కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్ష పదవికి గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి దరఖాస్తు సమర్పించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఏఐసీసీ జిల్లా పరిశీలకురాలు జ్యోతి రౌటేలాకు తన దరఖాస్తును అందజేశానన్నారు.

◆ అత్యపత్య జిల్లా స్థాయి ఎంపికలు

చిన్నకోడూరు(సిద్దిపేట): జిల్లా అత్యపత్య అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం చిన్నకోడూరు జూనియర్ కళాశాలలో జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించారు. బాలికలు, బాలురులకు వేర్వేరుగా ఎంపిక నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మయ్య, భిక్షపతి, రామేశ్వర్‌రెడ్డి, మహేశ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కోహెడరూరల్(హుస్నాబాద్): రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ప్యాక్స్ ఛైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు పిలుపునిచ్చారు. మండలంలోని నారాయణపూర్, శ్రీరాములపల్లి, పరివేద, వింజపల్లితోపాటు పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ ఛైర్మన్ నిర్మల–జయరాజ్‌తో కలసి ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ తిరుపతిరెడ్డి, సీఈఓ మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

◆ హెచ్‌ఎంపై సస్పెన్షన్ సరికాదు

నంగునూరు(సిద్దిపేట): బద్దిపడగ హెచ్‌ఎం పద్మను సస్పెండ్ చేయడం సరికాదని డీటీఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు దేవులపల్లి కిష్టయ్య అన్నారు. గురువారం నంగునూరులో విలేకరులతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజన నిర్వాహకుల తప్పిదాలను ఉపాధ్యాయులపై మోపడం ఎంతవరకు సమంజసం అన్నారు.

◆ ట్రాఫిక్ నిబంధనలతోనే భద్రత

గజ్వేల్‌రూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి భద్రంగా గమ్యం చేరాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ మురళి హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ ఏఎస్ఐ జగదీశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.